నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 29 మే 2024 | KHAMMAM

ఎమ్మెల్సీ ఎన్నికల్లో.. బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- పార్టీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డివైపే పట్టభద్రులు మొగ్గుచూపారు
- సర్వేలు కూడా బీఆర్ఎస్ గెలువబోతున్నట్లు చెబుతున్నాయి
- బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- స్వరాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లను చెరపడం ఎవరితరమూ కాదు
- తెలంగాణ ప్రజల గుండెల్లో ఉద్యమనేతది చెరగని స్థానం
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, మే 28 : ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు ఖాయమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు ధీమా వ్యక్తం చేశారు. పలు సంస్థల సర్వేల్లోనూ, తమ పార్టీ శ్రేణుల రిపోర్టుల్లోనూ ఇదే విషయం వెల్లడవుతోందని అన్నారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్షతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొనసాగించిన అభివృద్ధి చిహ్నాలను మాత్రమే మార్చగలరు గానీ తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ పొందిన సుస్థిరమైన స్థానాన్ని చెరపడం ఎవరితరమూ కాదని స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కృషి చేసిన కలెక్టర్లు సహా ఇతర అధికారులందరికీ అభినందనలు తెలుపుతున్నామని అన్నారు. అలాగే, పార్టీ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డిని బలపర్చిన పార్టీ అధినేత కేసీఆర్‌కు, ప్రచారంలో పాల్గొని శ్రేణుల్లో ఉత్తేజం నింపిన పార్టీ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ఘన విజయం సాధించబోతున్నట్లు ఇప్పటికే తేలిపోయిందని అన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాలతో పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించబోతున్నామని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడం ఎవరితరమూ కాదని స్పష్టం చేశారు. ఉద్యమనేత ఆనవాళ్లు లేకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. రైఫిల్‌రెడ్డిగా మారారని విమర్శించారు.

ఆనాడు ఉద్యమకారులపై రైఫిల్‌రెడ్డి తుపాకీ ఎక్కుపెట్టలేదా?

ఈనాడు ఇంతలా ఊగిపోతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో తన పాత్ర ఏమిటో చెప్పాలని వద్దిరాజు, మధు డిమాండ్ చేశారు. ఆనాడు తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన రైఫిల్‌రెడ్డి చరిత్ర తెలంగాణ బిడ్డలందరికీ తెలిసిందేనని అన్నారు. తెలంగాణ చరిత్ర నుంచి కాకతీయులను, నవాబులను ఎవరూ చెరిపేయలేరని అన్నారు. తెలంగాణలో గొలుసుకట్టు చెరువుల ఫలాలను నేడు మనమందరమూ పొందుతున్నామంటే అది కాకతీయులకు గొప్పదనం కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణను తమదైన స్థాయిలో అభివృద్ధి చేసిన గొప్పదనం కూడా నవాబులకు ఉందని అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో కేసీఆర్ చరిత్ర సుస్థిరంగా ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు బెల్లం వేణు, ఉప్పల వెంకటరమణ, తాజుద్దీన్, బిచ్చాల తిరుమలరావు, లకావత్ గిరిబాబునాయక్, దోకుపర్తి సుబ్బారావు, శీలంశెట్టి వీరభద్రం, నరేందర్, మందడపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాంలు సిద్ధం చేయండి : భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

యూనిఫాంను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

పాల్వంచ/పాల్వంచ రూరల్, మే 28 : ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించే నాటికి విద్యార్థులకు సంబంధించిన యూనిఫాంలన్నీ సిద్ధం చేయాలని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. పాల్వంచ పట్టణంలోని నెహ్రూనగర్, సీతానగర్‌లో మహిళా టైలర్లు కుడుతున్న యూనిఫాం కేంద్రాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఎంత మంది డ్రెస్సులు కుడుతున్నారు? రోజుకు ఎన్ని సిద్ధం చేస్తున్నారు? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు సరిపోయే విధంగా కొలతల ప్రకారం నాణ్యతతో దుస్తులను కుట్టాలని, ఏడాదిపాటు మన్నికగా ఉండేలా చూడాలన్నారు. సకాలంలో కుట్టే పనులన్నీ పూర్తి చేసి ఒకసారి దుస్తులను పరిశీలించాలన్నారు. అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఈవో వెంకటేశ్వరాచారి, తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి ఎస్‌కే సైదులు, మున్సిపల్ కమిషనర్ స్వామి, ఎంఈవో శ్రీరామ్మూర్తి, ఏఈ నీలావతి, మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

తేలేది 5న..

- బ్యాలెట్ బాక్సుల్లో భద్రంగా ఎమ్మెల్సీ అభ్యర్థుల భవితవ్యం
- జూన్ 5న నల్గొండలో ఓట్ల లెక్కింపు
- రాకేశ్‌రెడ్డి వైపు పట్టభద్రుల మొగ్గు!
- నల్గొండకు తరలిన ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యాలెట్ బాక్సులు

నల్లగొండలోని గోదాములో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్‌కు సీల్ వేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జ, కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి చందన, నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి

ఖమ్మం, మే 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం-వరంగల్-నల్గొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల భవితవ్యం జూన్ 5వ తేదీన తేలనున్నది. ప్రస్తుతం బ్యాలెట్ బాక్సుల్లో భద్రంగా నిక్షిప్తమై ఉంది. ఈ నెల 27వ తేదీన జరిగిన పోలింగ్‌లో వివిధ రాజకీయపక్షాలు మద్దతు ప్రకటించిన అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచి హోరాహోరీగా పోరు సలిపారు. పోలింగ్ పూర్తయిన వెంటనే ఉమ్మడి ఖమ్మంజిల్లాకు చెందిన బ్యాలెట్ బాక్సులను నల్గొండలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. జూన్ 5వ తేదీన మూడు ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన ఓట్లను నల్గొండ జిల్లాలో ఏర్పాటుచేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో లెక్కించనున్నారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును పెద్దఎత్తున వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇచ్చిన ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మద్దతిచ్చిన తీన్మార్ మల్లన్న, బీజేపీ మద్దతిచ్చిన ప్రేమేందర్‌రెడ్డితో పాటు పలువురు అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఖమ్మం జిల్లాలో 83,879 మంది ఓటర్లు ఉండగా 56,730 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 40,106 ఓటర్లు ఉండగా 28,077 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శాసనమండలిని 2007లో పునరుద్ధరించిన విషయం విదితమే. ఆ సంవత్సరం జరిగిన ఎన్నికల్లో ఖమ్మం-నల్గొండ-వరంగల్ నియోజకవర్గం నుంచి దిలీప్‌కుమార్ పోటీచేశారు. లాటరీ పద్ధతిన ఆయనకు కొన్ని సంవత్సరాలు మాత్రమే తొలిసారి అవకాశం రావడంతో పదవీకాలం ముగిసిన వెంటనే రెండోసారి పోటీచేసి బీఆర్ఎస్ తరపున విజయం సాధించారు. అనంతరం 2015లో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పల్లా రాజేశ్వరరెడ్డి పోటీ చేసి విజయం సాధించారు. 2021లో జరిగిన ఎన్నికల్లోనూ తిరిగి పల్లా రాజేశ్వరరెడ్డి ఘన విజయం సాధించారు. ఈ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసన మండలి పునరుద్ధరణ తర్వాత నాలుగుసార్లు ఎన్నికలు జరగ్గా నాలుగుసార్లు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థే విజయం సాధించారు. దీంతో పట్టభద్రుల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేని ఆధిపత్యం ఉన్నట్లు వెల్లడైంది. ఐదోసారి జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీకే సానుకూల పవనాలు ఉండడం, పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విద్యావంతుడు కావడం, సామాజిక సేవారంగంలోనూ అగ్రగణ్యుడిగా ఉండి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు విద్యార్థి, నిరుద్యోగ పట్టభద్రుల్లో గట్టి పట్టు కలిగి ఉండడం వంటి అంశాలతో రాకేశ్‌రెడ్డి ఈ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించడానికి దోహదపడే అంశాలుగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. రాకేశ్‌రెడ్డి విజయం కోసం బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో పర్యటించి ప్రశ్నించే గొంతుక, ఉన్నత విద్యావంతుడు అయిన రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే పట్టభద్రులకు అండగా ఉంటారని, నిరుద్యోగ భృతి, జాబ్‌క్యాలెండర్ వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరు సలిపేందుకు అవకాశం ఉంటుందని నేతలు ఇచ్చిన పిలుపు పట్టభద్రులను ఆలోచింపచేసింది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ పార్టీ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పట్టభద్రులను నేరుగా కలవడంతోపాటు సభలు, సమావేశాల ద్వారా, మార్నింగ్‌వాక్‌ల ద్వారా ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియానాయక్, మదన్‌లాల్, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు తదితరులు ఆయా నియోజకవర్గాల్లో పట్టభద్రుల ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించారు. అలాగే పార్టీ నియమించిన నియోజకవర్గ సమన్వయకర్తలు సైతం పట్టభద్రుల ఎన్నికల్లో ప్రచారం నిర్వహించడంతోపాటు ఎన్నిక విజయానికి సమన్వయం చేశారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాకేశ్‌రెడ్డికి అన్ని నియోజకవర్గాల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు అత్యధికంగా పోల్ కావడానికి దోహదపడిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మూడు ఉమ్మడి జిల్లాల్లోనూ రాకేశ్‌రెడ్డి ఏకపక్షంగా ఓట్లు లభించడం, ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మెజార్టీ ఓట్లు మొదటి ప్రాధాన్యతలోనే రాకేశ్‌రెడ్డికి లభించడం, ప్రతిపోటా నిరుద్యోగ యువత, పట్టభద్రుల ఉద్యోగులు రాకేశ్‌రెడ్డి వైపు మొగ్గుచూపడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా ఓటువేసి బీఆర్ఎస్‌కు అండగా నిలిచినట్లు రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

తగ్గిన ఎమ్మెల్సీ పోలింగ్

- తుది పోలింగ్ 72.44 శాతం
- 2021తో పోలిస్తే 3.97శాతం తగ్గుదల
- అత్యధికంగా యాదాద్రిలో 78.59శాతం
- అత్యల్పంగా ఖమ్మంలో 67.62శాతం
- నల్లగొండలోని దుప్పలపల్లి స్ట్రాంగ్ రూమ్స్‌లో బ్యాలెట్ బాక్స్‌లు భద్రం
- మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు
- వచ్చే నెల 5నుంచి ఓట్ల లెక్కింపు
- పోలింగ్ సరళిపై అంచనాల్లో అభ్యర్థులు

నల్లగొండ ప్రతినిధి, మే28(నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్గొండ శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఉపఎన్నికలో పోలింగ్ శాతం తగ్గింది. 2021 మార్చిలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత ఉప ఎన్నికలో 3.97శాతం తగ్గింది. పోలింగ్‌కు సాయంత్రం 4గంటల వరకే గడువు ఉన్నా... అప్పటికే క్యూలైన్లలో ఉన్న ఓటర్లంతా ఓటు వేసే సరికి కొన్నిచోట్ల సాయంత్రం ఏడు గంటలు కూడా దాటింది. దాంతో 12 జిల్లాల నుంచి తుది ఓటింగ్ వివరాలు రావడానికి సోమవారం అర్ధరాత్రి దాటింది. మంగళవారం ఉదయం ఫైనల్ పోలింగ్ వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన వెల్లడించారు. మొత్తం 72.44శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 78.59శాతం కాగా అత్యల్పంగా ఖమ్మం జిల్లాలో 67.62శాతం నమోదైంది. పోలింగ్ ముగిసిన తర్వాత అన్ని జిల్లా కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్స్‌లను భారీ బందోబస్తు నడుమ నల్లగొండ సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లోని స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలించారు. అక్కడ 24గంటల పాటు సీసీ టీవీ కెమెరా పర్యవేక్షణలో మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. జూన్ 5వ తేదీ నుంచి ఓట్ల లెక్కింపు మొదలుకానుండగా ప్రధాన అభ్యర్థులంతా పోలింగ్ సరళిపై లెక్కల్లో మునిగి తేలుతున్నారు. 2021 ఎన్నికలతో పోలిస్తే 41వేలపై చిలుకు ఓటర్ల సంఖ్య తక్కువగా ఉన్నా సరే ప్రస్తుత ఉప ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గింది. అప్పుడు మొత్తం 5,05,565 మంది ఓటర్లు ఉండగా 3,86,320 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 76.41శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుతం మొత్తం 4,63,839 మంది ఓటర్లు ఉండగా 3,36,005 మంది ఓటర్లు ఓటేయగా 72.44శాతం పోలింగ్ నమోదైంది. మూడేండ్ల కిందట జరిగిన ఎన్నికతో పోలిస్తే ప్రస్తుతం పోలింగ్ 3.97శాతం తగ్గింది. ఉప ఎన్నికల సమయంలో ఓట్లు నమోదు చేయించుకోవడంలో చూపిన ఉత్సాహం పోలింగ్ రోజున చూపకలేకపోయారు.

యాదాద్రి జిల్లాలో అత్యధికం

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఎప్పటిలాగే యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైంది. ఇక్కడ 78.59 శాతం ఓటింగ్ జరుగడం విశేషం. ఇది కిందటి సారి కంటే నియోజకవర్గం సగటు ఓటింగ్‌ను కూడా క్రాస్ చేసింది. ఇక అత్యల్పంగా ఖమ్మంలో 67.62శాతమే పోలింగ్ జరిగింది. రెండో స్థానంలో జనగామలో 76.34శాతం, ఆ తర్వాత వరుసగా సిద్దిపేటలో 76.13శాతం, ములుగులో 74.58శాతం, జయశంకర్‌భూపాలపల్లిలో 73.62శాతం, నల్లగొండలో 73.29 శాతం, సూర్యాపేటలో 73.15శాతం, వరంగల్‌లో 72.68శాతం, హన్మకొండలో 72.45శాతం, మహబూబాబాద్‌లో 72.15శాతం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 69.95శాతం ఓటింగ్ నమోదైంది.

స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రత

సోమవారం సాయంత్రం 12 జిల్లాల పరిధిలో పోలింగ్ ముగిసాక బ్యాలెట్ బాక్స్‌లను ముందుగా ఆయా జిల్లా కేంద్రాల్లోని రిసెప్షన్ కేంద్రాలకు తరలించారు. అక్కడికి అన్ని చేరాక భారీ బందోబస్తు నడుమ రూట్ల వారీగా మంగళవారం తెల్లవారుజాము వరకు నల్లగొండ శివారులోని అనిశెట్టి దుప్పలపల్లి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములకు చేరవేశారు. స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థతోపాటు 24 గంటల పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులతోపాటు సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో నిరంతర పహారా కొనసాగేలా చర్యలు చేపట్టారు.

వచ్చే నెల 5 నుంచి కౌంటింగ్

వచ్చే నెల 4వ తేదీన పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కూడా దుప్పలపల్లి గోదాములోనే జరుగనుంది. దాని మర్నాడు 5వ తేదీన అక్కడే ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ చేపట్టనున్నారు. ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ మొదలు కానుంది. ముందుగా బ్యాలెట్ బాక్స్‌లను ఓపెన్ చేసి బ్యాలెట్ పేపర్లను 25 చొప్పున ఒక బండిల్‌గా రూపొందిస్తారు. ఇది పూర్తయ్యాక తొలి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు మొదలుపెడతారు. ఇదే సమయంలో చెల్లని ఓట్ల లెక్క తేలుస్తారు. దీని అనంతరం గెలుపు కోటా అంటే చెల్లిన ఓట్లలో 50శాతం ప్లస్ ఒకటిని ఖరారు చేస్తారు. తొలి ప్రాధాన్యతా ఓట్లలో గెలుపు కోటా ఎవరికీ రాకపోతే దాన్ని చేరుకునే వరకు ఎలిమినేషన్ పద్ధతిలో కౌంటింగ్‌ను పూర్తి చేస్తారు. మొత్తం కౌంటింగ్ పూర్తయ్యే సరికి కనీసం 48 గంటలు పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. అప్పటివరకు ప్రధాన అభ్యర్థులంతా పోలింగ్ సరళిని అంచనా వేస్తూ గెలుపోటములపై సమీక్షల్లో మునిగి తేలాల్సిందే.

స్ట్రాంగ్ రూమ్స్‌కు బ్యాలెట్ బాక్స్‌లు

- ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జ సమక్షంలో సీల్
- పటిష్ట బందోబస్తు చర్యలు
- ప్రశాంత పోలింగ్‌కు కృతజ్ఞతలు : ఆర్‌ఓ హరిచందన

స్ట్రాంగ్ రూమ్‌లలో బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జ, కలెక్టర్ చందన, నల్లగొండ ఎస్పీ

నల్లగొండ ప్రతినిధి, మే28(నమస్తే తెలంగాణ) : పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సోమవారం సాయంత్రం ముగిసిన తర్వాత అన్ని జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులను భారీ భద్రత మధ్య నల్లగొండ సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి గోదాముల్లోని స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసినా అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్లంతా ఓటు వేయడానికి కొన్నిచోట్ల సాయంత్రం ఏడు గంటల వరకు కొనసాగిందన్నారు. పోలింగ్ ఎక్కడా ఎలాంటి అంతరాయం లేకుండా శాంతియుత వాతావరణంలో జరిగిందని పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియలో మొత్తం 12 జిల్లాల జిల్లా కలెక్టర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించిన అడిషనల్ కలెక్టర్లు, పోలీస్ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, ఎమ్మెల్సీ ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించగలిగామని చెప్పారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరుగలేదన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితోపాటు ఆర్‌ఓలు పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్‌లో నిరంతరం పర్యవేక్షించారని తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ఓటర్లు, జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు, 12 జిల్లాల సిబ్బందికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల సమక్షంలో సీల్

బ్యాలెట్ బాక్సులను అనిశెట్టి దుప్పలపల్లి గోదాములో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చగా కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి చందన, జిల్లా ఎస్పీ చందనాదీప్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జ సమక్షంలో సీల్ వేశారు. వారితోపాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, వారి ఏజెంట్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీఎఫ్ఓ రాజశేఖర్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీపీఓ మురళి, పీఆర్ ఈఈ భూమన్న, ఎస్‌బీ డీఎస్పీ పి.రమేశ్, బీజేపీ నుంచి ఎలక్షన్ ఏజెంట్ నాగం వర్షిత్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న ఏజెంట్ కాళీ, అభ్యర్థి రవి, బీఆర్ఎస్ నుంచి అధికారిక ఏజెంట్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ హాళ్ల వద్ద మూడంచెల భద్రత

వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

సమీక్షలో పాల్గొన్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ, ఇతర అధికారులు

మామిళ్లగూడెం, మే 28 : జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద మూడంచెల పోలీస్ భద్రత ఏర్పాటు చేయాలని, ఇతరులు ఎవరూ లోనికి రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లాకు చెందిన ఆర్‌వోలు, ఏఆర్వోలు, సీపీ, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్ దత్, నగర పాలక కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌లు సమీక్షలో పాల్గొన్నారు. కౌంటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఈవో దిశానిర్దేశం చేశారు. 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించాలని, పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల ఓట్లు ఒకేసారి లెక్కించాలని సూచించారు. ఫలితాల ప్రకటన కోసం మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, రౌండ్లవారీగా ఫలితాలను ఎప్పటికప్పుడు ప్రకటించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఐదు వీవీ ప్యాట్స్ నుంచి ఓటరు స్లిప్పులను తప్పనిసరిగా లెక్కించాలని ఆదేశించారు. ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది సెల్‌ఫోన్లు కౌంటింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని ఒకేచోట భద్రపరచాలని తెలిపారు. కౌంటింగ్ సజావుగా సాగేలా అధికారులందరూ ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయండి

వీసీలో పాల్గొన్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, మే 28 (నమస్తే తెలంగాణ) : జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేయాలని, కౌంటింగ్ సజావుగా జరిగేలా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసేలా చూడాలని, గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ కౌంటింగ్ ముగిసిన తర్వాత అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎంలను గోడౌన్‌కు పటిష్ట భద్రత మధ్య తరలించాలన్నారు. సమావేశంలో భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రంగప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి : ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఐటీడీఏ పీవో

భద్రాచలం/అశ్వారావుపేట రూరల్, మే 28 : విద్యార్థినులు ఉన్నత చదువులు అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని, మంచి ఉద్యోగంలో స్థిరపడాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. భీమున